PRGI NO: TGTEL/26/A0383
డైనమిక్ జనంవాయిస్
తెలుగు దినపత్రిక
నిజం మా మాట | న్యాయం మా ధ్యేయం | ప్రజల కోసం మా ప్రయాణం

# సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్‌లో భారీ కొండచిలువ కలకలం

**చాకచక్యంగా పట్టుకున్న పాముల శేఖర్.**
**కార్మిక కుటుంబాల్లో భయాందోళన.**

**జనం వాయిస్, మందమర్రి, అక్టోబర్ 2:**



మందమర్రి పట్టణంలోని మార్కెట్ ఏరియాలో పోస్టాఫీస్ ఎదురుగా ఉన్న సింగరేణి సీఐఎస్ఎఫ్ క్వార్టర్స్‌లో భారీ కొండచిలువ ప్రత్యక్షం కావడంతో కార్మిక కుటుంబాల్లో తీవ్ర కలకలం నెలకొంది. గురువారం రాత్రి సుమారు 10.40 గంటల సమయంలో కాసిపేట గనిలో విధులు నిర్వహిస్తున్న ఓ సింగరేణి కార్మికుడు బాత్రూంకు వెళ్లేందుకు ఇంటి నుంచి బయటకు రాగా, ఇంటి ఆవరణలో భారీ కొండచిలువ కనిపించింది. దీంతో ఒక్కసారిగా అప్రమత్తమైన కుటుంబ సభ్యులు భయాందోళనకు గురయ్యారు. వెంటనే పాములు పట్టడంలో అనుభవం ఉన్న పాముల శేఖర్‌కు సమాచారం అందించగా, ఆయన అక్కడికి చేరుకుని ఎంతో చాకచక్యంగా కొండచిలువను పట్టుకున్నారు. అనంతరం దానిని జనావాసాలకు దూరంగా ఉన్న సురక్షిత ప్రాంతానికి తరలించారు. దీంతో కార్మిక కుటుంబాలు ఊపిరి పీల్చుకున్నాయి. కొండచిలువ సుమారు 6 నుంచి 7 అడుగుల పొడవు ఉన్నట్లు స్థానికులు తెలిపారు. చిన్నారుల భద్రతపై ఆందోళన సింగరేణి క్వార్టర్స్‌లో పెద్ద సంఖ్యలో కార్మిక కుటుంబాలు నివసిస్తుండటంతో పాటు చిన్నారులు కూడా ఉండటంతో ఈ ఘటన స్థానికుల్లో మరింత ఆందోళనకు కారణమైంది. రాత్రివేళ ఇంటి ఆవరణలోనే భారీ కొండచిలువ కనిపించడంతో భవిష్యత్తులో మరిన్ని విషపూరిత పాములు, ఇతర వన్యప్రాణులు క్వార్టర్స్‌లోకి వచ్చే అవకాశం ఉందని కుటుంబ సభ్యులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

**గుబురుగా పెరిగిన పొదలే కారణమా?**

క్వార్టర్స్ చుట్టూ చెట్లు, గుబురుగా పెరిగిన పొదలు, ఖాళీ ప్రదేశాలు అధికంగా ఉండటంతో పాములు సంచరించేందుకు అనుకూల వాతావరణం ఏర్పడిందని స్థానికులు చెబుతున్నారు. పరిసరాలను క్రమం తప్పకుండా శుభ్రం చేయకపోవడం, చెత్తాచెదారం పేరుకుపోవడం వల్ల ఇలాంటి ఘటనలు చోటుచేసుకుంటున్నాయని వారు ఆరోపిస్తున్నారు.

పారిశుద్ధ్య చర్యలు చేపట్టాలని డిమాండ్

మందమర్రి ఏరియాలోని అన్ని సింగరేణి క్వార్టర్స్ పరిసరాలను అధికారులు పరిశీలించి, గుబురుగా పెరిగిన చెట్లు, పొదలు, చెత్తాచెదారాన్ని వెంటనే తొలగించాలని కార్మికులు, స్థానికులు కోరుతున్నారు. ముఖ్యంగా చిన్నారులు, వృద్ధులు నివసించే క్వార్టర్స్‌లో భద్రతా చర్యలను మరింత పటిష్టం చేయాలని డిమాండ్ చేస్తున్నారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా సింగరేణి అధికారులు తక్షణమే స్పందించి పారిశుద్ధ్యంతో పాటు అవసరమైన భద్రతా చర్యలు చేపట్టాలని కోరుతున్నారు.

# జర్నలిస్టుల దీర్ఘకాలిక సమస్యలను వెంటనే పరిష్కరించాలి..!

- **గాంధీ జయంతి వేళ 'టియుడబ్ల్యూజే (ఐజేయు)' ఆధ్వర్యంలో డిమాండ్స్ డే.**
- **నల్ల బ్యాడ్జీలతో నిరసన.. ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్‌కు వినతిపత్రం అందజేత.**

**మహబూబాబాద్, అక్టోబర్ 2 (జనం వాయిస్) :**



జర్నలిస్టుల హక్కులు, భద్రత, సంక్షేమానికి సంబంధించిన దీర్ఘకాలిక సమస్యలను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు వెంటనే పరిష్కరించాలని డిమాండ్ చేస్తూ టియుడబ్ల్యూజే (ఐజేయు) మహబూబాబాద్ జిల్లా శాఖ ఆధ్వర్యంలో శుక్రవారం 'డిమాండ్ల దినోత్సవం' (డిమాండ్స్ డే) నిర్వహించారు. గాంధీ జయంతిని పురస్కరించుకుని మహబూబాబాద్ గాంధీ పార్క్‌లోని మహాత్మా గాంధీ విగ్రహం వద్ద జర్నలిస్టులు నల్ల బ్యాడ్జీలు ధరించి వినూత్నంగా నిరసన తెలిపారు. జర్నలిస్టుల సమస్యలను పరిష్కరించాలంటూ పెద్ద పెట్టున నినాదాలు చేశారు. అనంతరం మహాత్మా గాంధీ విగ్రహానికి, అలాగే మహబూబాబాద్ నియోజకవర్గ ఎమ్మెల్యే డాక్టర్ భూక్యా మురళీనాయక్‌కు తమ సమస్యలతో కూడిన వినతిపత్రాన్ని జర్నలిస్టుల ప్రతినిధులు అందజేశారు.

**కొత్త మీడియా కమిషన్ ఏర్పాటు చేయాలి :**

**గాడిపల్లి మధు, సిహెచ్ శ్రీనివాస్**

ఈ సందర్భంగా టియూడబ్ల్యూజే (ఐజేయు) రాష్ట్ర ఉపాధ్యక్షుడు గాడిపల్లి మధు, మహబూబాబాద్ జిల్లా అధ్యక్షులు సిహెచ్ శ్రీనివాస్ మాట్లాడుతూ.. దేశంలో వేగంగా మారుతున్న మీడియా రంగ పరిస్థితులను సమగ్రంగా సమీక్షించడానికి, విధానపరమైన సిఫార్సులు చేయడానికి తక్షణమే కొత్త మీడియా కమిషన్‌ను ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. జర్నలిస్టులు, మీడియా సిబ్బంది, వార్తా సంస్థల భద్రత కోసం ప్రత్యేక కేంద్ర చట్టాన్ని తీసుకురావాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. కొత్త కార్మిక చట్టాల్లో విలీనమైన 1955, 1958 నాటి వర్కింగ్ జర్నలిస్టుల ప్రత్యేక చట్టాల ద్వారా గతంలో కల్పించిన హక్కులు, ఉద్యోగ భద్రత, పని గంటలు, వివాద పరిష్కార విధానాలు, సేవల విరమణ రక్షణలను తక్షణమే పునరుద్ధరించాలని వారు కోరారు. ప్రింట్, ఎలక్ట్రానిక్, డిజిటల్ మీడియా ఉద్యోగులందరికీ వర్తించేలా కొత్త వేతన బోర్డును (వేజ్ బోర్డ్) ఏర్పాటు చేసి, పెరుగుతున్న ద్రవ్యోల్బణానికి అనుగుణంగా వేతన సిఫార్సులు చేయాలని విజ్ఞప్తి చేశారు.

**ఇళ్ల స్థలాలు, హెల్త్ కార్డులు మంజూరు చేయాలి**

రాష్ట్రంలోని అర్హులైన జర్నలిస్టులందరికీ త్వరితగతిన ఇళ్ల స్థలాలు కేటాయించాలని, రాష్ట్ర ప్రభుత్వ ఉద్యోగులతో సమానంగా జర్నలిస్టులకు కూడా ఉచిత వైద్య సదుపాయాలను వెంటనే పునరుద్ధరించాలని నాయకులు డిమాండ్ చేశారు. దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న జర్నలిస్టుల సమస్యలపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి, త్వరగా పరిష్కరించాలని కోరారు. ఈ నిరసన కార్యక్రమంలో యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి గాడిపల్లి శ్రీహరి, జిల్లా కోశాధికారి వెంకటరమణ, జిల్లా ఉపాధ్యక్షుడు ఉమ్మగాని మధు, ఎలక్ట్రానిక్ మీడియా జిల్లా ప్రధాన కార్యదర్శి రంగాచౌదరి, జిల్లా కార్యవర్గ సభ్యుడు అశోక్ తో పాటు జిల్లాలోని పలువురు జర్నలిస్టు నాయకులు, ప్రతినిధులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూముల కబ్జాపై ఉద్యమం ఉధృతం

- **ప్రభుత్వ భూముల కబ్జాలను అడ్డుకుంటామని గతంలో చెప్పిన ఎమ్మెల్యే మురళి నాయక్.**
- **గెలిచిన తర్వాత కబ్జాదారులను అక్కున చేర్చుకోవడం ఏమిటి?**
- **ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గూగులోతు భీమా నాయక్.**

**మహబూబాబాద్, అక్టోబర్ 2 (జనం వాయిస్) :**



మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ భూముల వ్యవహారంపై ప్రజా సంఘాల ఆధ్వర్యంలో ఉద్యమం మరింత ఉధృతం కానుందని ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు గూగులోతు భీమా నాయక్ అన్నారు. ప్రభుత్వ భూముల పరిరక్షణకు ప్రభుత్వం తక్షణమే చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహబూబాబాద్ జిల్లా కేంద్రంలోని సర్వే నంబర్ 107లో ఉన్న ప్రభుత్వ భూమిని ప్రభుత్వం స్వాధీనం చేసుకోవాలని కోరుతూ ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా అధ్యక్షుడు బోడ రమేష్ నాయక్ అధ్యక్షతన నిర్వహించిన రౌండ్‌టేబుల్ సమావేశంలో భీమా నాయక్ పాల్గొని మాట్లాడారు. ప్రభుత్వ భూముల కబ్జాలను అడ్డుకుంటామని గతంలో చెప్పిన ఎమ్మెల్యే మురళి నాయక్, ప్రస్తుతం అదే వ్యవహారంలో ఆరోపణలు ఎదుర్కొంటున్న వ్యక్తులను చేరదీస్తున్నారని ఆయన ఆరోపించారు. వందల కోట్ల విలువైన ప్రభుత్వ భూమిపై ఆరోపణలు ఉన్నప్పటికీ అధికారులు ఎందుకు స్పందించడం లేదని ఆయన ప్రశ్నించారు. గతంలో అప్పటి మహబూబాబాద్ కలెక్టర్ ప్రీతిమీనా ప్రభుత్వ భూమిలో అక్రమ నిర్మాణాలపై చర్యలకు ఆదేశాలు ఇచ్చారని, ప్రస్తుతం ఆ ఆదేశాల అమలుపై అధికారులు స్పష్టత ఇవ్వాలని డిమాండ్ చేశారు. ప్రభుత్వ భూముల వ్యవహారంలో నకిలీ పత్రాలు ఉపయోగించారా?, పోలీసు, రెవెన్యూ అధికారులను తప్పుదోవ పట్టించారా? అనే అంశాలపై సమగ్ర దర్యాప్తు జరిపించాలని కోరారు. ఆరోపణలు నిజమని తేలితే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. మహబూబాబాద్‌లో శాంతిభద్రతలకు విఘాతం కలిగించే పరిస్థితులు ఏర్పడితే జిల్లా కలెక్టర్, ఎస్పీలే బాధ్యత వహించాల్సి ఉంటుందని ఇంటెలిజెన్స్ విభాగాన్ని ఉద్దేశించి భీమా నాయక్ వ్యాఖ్యానించారు. ప్రభుత్వ భూముల రక్షణ కోసం ప్రజా, విద్యార్థి, దళిత, గిరిజన సంఘాలతో కలిసి ఉద్యమాన్ని మరింత విస్తృతం చేస్తామని స్పష్టం చేశారు. ఈ సమావేశంలో ఎల్‌హెచ్‌పీఎస్ రాష్ట్ర అధ్యక్షుడు రాజేష్ నాయక్, రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వాసు నాయక్, అంబేద్కర్ యువజన జిల్లా కార్యదర్శి నీరుడు సామెల్, గోర్ సిక్వడి జిల్లా నాయకుడు బిచ్చు చవాన్, ఎల్‌హెచ్‌పీఎస్ మహిళా విభాగం అధ్యక్షురాలు స్వర్ణలత, వికలాంగుల విభాగం నాయకుడు రాందాస్ నాయక్, దొరల హక్కుల పోరాట సంఘం రాష్ట్ర అధ్యక్షుడు శ్రీనివాస్ రెడ్డి, ఎల్‌హెచ్‌పీఎస్ జిల్లా నాయకులు విష్ణు నాయక్, శ్రీను, మంగీలాల్, సుమన్, సాయి తదితరులు పాల్గొన్నారు.

# గ్రామ స్వరాజ్యమే గాంధీజీ కల

- **ప్రజల భాగస్వామ్యంతోనే అభివృద్ధి.**
- **సత్యం, అహింస, సేవను నిత్య జీవితంలో ఆచరించడమే నిజమైన నివాళి.**

**మహబూబాబాద్, అక్టోబర్ 2 (జనం వాయిస్):**



మహాత్మా గాంధీజీ 157వ జయంతి వేడుకలను కేసముద్రం మండల కేంద్రంలో కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. కేసముద్రం మండల కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ ఆధ్వర్యంలో గాంధీ సెంటర్ వద్ద నిర్వహించిన కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు, ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. గాంధీజీ విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కార్యక్రమానికి మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి ముఖ్యఅతిథిగా హాజరై గాంధీజీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా స్వాతంత్ర్య ఉద్యమంలో గాంధీజీ పోషించిన కీలక పాత్రను, సత్యం, అహింస సిద్ధాంతాలతో దేశ ప్రజలను ఏకం చేసిన ఆయన సేవలను నాయకులు స్మరించుకున్నారు.

**ప్రజల కోసం రాజకీయాలు.. పదవుల కోసం కాదు**

మండల కాంగ్రెస్ అధ్యక్షులు చిలువేరు సమ్మయ్య గౌడ్ మాట్లాడుతూ, గాంధీజీ దృష్టిలో రాజకీయాలు అంటే పదవులు, అధికారం కాదని, ప్రజాసేవకు పవిత్రమైన సాధనమని అన్నారు. సమాజంలో చివరి వరుసలో ఉన్న పేదవాడి కన్నీరు తుడవడమే నిజమైన ప్రజాసేవ అని గాంధీజీ తన జీవితంతో చూపించారని పేర్కొన్నారు. సత్యం, అహింస, సేవను ప్రతి ఒక్కరూ జీవితంలో భాగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. గాంధీజీ ఆశయాలను జయంతి రోజున మాత్రమే స్మరించుకోకుండా నిత్య జీవితంలో ఆచరించడమే ఆయనకు ఇచ్చే నిజమైన నివాళి అని అన్నారు.

**గ్రామ స్వరాజ్యమే గాంధీజీ స్వప్నం**

మార్కెట్ కమిటీ చైర్మన్ గంట సంజీవరెడ్డి మాట్లాడుతూ, భారతదేశ ఆత్మ గ్రామాల్లోనే ఉందని గాంధీజీ విశ్వసించారని అన్నారు. ప్రతి గ్రామం స్వయం సమృద్ధి సాధించి ఆర్థిక, సామాజికంగా అభివృద్ధి చెందాలన్నదే ఆయన ఆకాంక్ష అని తెలిపారు. స్థానిక సమస్యలను స్థానిక ప్రజల భాగస్వామ్యంతో పరిష్కరించుకున్నప్పుడే గ్రామ స్వరాజ్యం సాకారమవుతుందని పేర్కొన్నారు. గాంధీజీ ఒక వ్యక్తి మాత్రమే కాదని.. ఒక మహత్తర ఆలోచన, సిద్ధాంతం, నిత్య స్ఫూర్తి అని పలువురు వక్తలు కొనియాడారు. సత్యం, అహింస, స్వచ్ఛత, సేవ, గ్రామ స్వరాజ్యం వంటి ఆయన ఆశయాలు నేటి సమాజానికి కూడా ఎంతో అవసరమని అన్నారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ సునీత వెంకన్న, వైస్ చైర్మన్ అంబటి మహేందర్ రెడ్డి, ఆర్టిఏ మెంబర్ రావుల మురళి, కౌన్సిలర్లు తరాల వీరేష్, కిషోర్ నాయక్, భధ్యా నాయక్, రాంబాబు, రడం వెంకన్న, రడం శ్రీనివాస్, బానోత్ లక్ష్మీబాలు, కొత్త ప్రభాకర్, ఆయూబ్ ఖాన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే మార్కెట్ డైరెక్టర్ యాదగిరి, మాజీ ఎంపీటీసీలు బాలు నాయక్, శ్రీనివాస్ గౌడ్, వివిధ గ్రామాల పార్టీ అధ్యక్షులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, పార్టీ అనుబంధ సంఘాల నాయకులు, యూత్ కాంగ్రెస్, ఎన్ఎస్‌యుఐ నాయకులు, పార్టీ కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో హాజరయ్యారు.

# సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటికీ స్ఫూర్తిదాయకం

**మందమర్రిలో ఘనంగా మహాత్మా గాంధీ జయంతి వేడుకలు**

**జనం వాయిస్, మందమర్రి, అక్టోబర్ 2:**

మహాత్మా గాంధీ జయంతిని పురస్కరించుకుని మందమర్రి పట్టణ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో గురువారం ఘనంగా వేడుకలు నిర్వహించారు. స్థానిక అంగడి బజార్‌లోని మహాత్మా గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా మాజీ పట్టణ కాంగ్రెస్ అధ్యక్షులు నోముల ఉపేందర్ గౌడ్, ఉమ్మడి జిల్లా మాజీ ప్రధాన కార్యదర్శి సోతుకు సుదర్శన్ మాట్లాడుతూ.. గాంధీజీ ప్రపంచానికి చూపిన సత్యం, అహింస, శాంతి మార్గాలు నేటి సమాజానికి సైతం స్ఫూర్తిదాయకమని అన్నారు. గాంధీజీ ఆచరించిన విలువలను ప్రతి ఒక్కరూ తమ జీవితాల్లో పాటించాలని సూచించారు. అహింసా సూత్రాన్ని ఆచరిస్తూ సాటి జీవుల పట్ల ప్రేమ, కరుణ, దయతో వ్యవహరించాలని పిలుపునిచ్చారు. సమాజంలో శాంతి, సోదరభావం, మానవతా విలువలను పెంపొందించేందుకు గాంధీజీ ఆశయాలను ముందుకు తీసుకెళ్లాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందన్నారు. ఈ కార్యక్రమంలో సేవాదళ్ జిల్లా అధ్యక్షులు ఎం.డి. హాఫీజ్, ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు కనకం రాజు, సేవాదళ్ పట్టణ అధ్యక్షులు సోతుకు ఉదయ్, మాజీ ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షులు నేరువట్ల శ్రీనివాస్, సేవాదళ్ జిల్లా ఉపాధ్యక్షులు ఎం.డి. పాషా, పట్టణ ప్రధాన కార్యదర్శి బండి శంకర్ గౌడ్, మాజీ పట్టణ అధ్యక్షులు మంకు రమేష్, మాజీ పట్టణ ప్రధాన కార్యదర్శి బూడిద శంకర్, మాజీ పట్టణ ఉపాధ్యక్షులు ఎం.డి. సుకూర్, యువజన కాంగ్రెస్ మండల ఉపాధ్యక్షులు మాయ తిరుపతి, ఎగ్జిక్యూటివ్ మెంబర్ రెడ్డి ఐలయ్య, మైనార్టీ నాయకులు ఎం.డి. చోటేమియా, ఎం.డి. యాకూబ్, ఎం.డి. షరీఫ్, మెండ భాస్కర్, రవీందర్, లక్ష్మణ్, శేఖర్, రాజేష్ తదితర కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.




# గాంధీజీ ఆశయాలు పోలీసులకు మార్గదర్శకం

**అహింస, సత్యం, శాంతి సిద్ధాంతాలతో ప్రజలకు సేవ చేయాలి : ఎస్పీ డా. శబరీష్**

**మహబూబాబాద్, అక్టోబర్ 2 (జనం వాయిస్) :**



జాతిపిత మహాత్మా గాంధీ జయంతి వేడుకలను మహబూబాబాద్ జిల్లా పోలీసు ప్రధాన కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి జిల్లా ఎస్పీ డా. శబరీష్, ఐపీఎస్ ముఖ్య అతిథిగా హాజరై గాంధీజీ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. దేశ స్వాతంత్ర్య పోరాటంలో మహాత్మా గాంధీ అందించిన సేవలు చిరస్మరణీయమని అన్నారు. అహింస, సత్యం, శాంతి వంటి గాంధీజీ అమూల్యమైన సిద్ధాంతాలు నేటికీ సమాజానికి మార్గదర్శకమని పేర్కొన్నారు. ప్రతి పోలీసు సిబ్బంది గాంధీజీ జీవితం నుంచి స్ఫూర్తి పొంది ప్రజలకు అందుబాటులో ఉంటూ నిబద్ధత, పారదర్శకతతో విధులు నిర్వర్తించాలని సూచించారు. సమాజంలో శాంతిభద్రతల పరిరక్షణ, మత సామరస్యం, ప్రజా రక్షణకు పోలీసులు మరింత బాధ్యతాయుతంగా పనిచేయాలని తెలిపారు. ప్రతి పౌరుడి హక్కులను గౌరవిస్తూ సామాజిక న్యాయం, సమానత్వం అనే గాంధీయ సూత్రాలకు అనుగుణంగా ప్రజలతో మమేకం కావాలని ఎస్పీ పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మహబూబాబాద్ టౌన్ ఇన్‌స్పెక్టర్ రఘుపతి రెడ్డి, ఆర్ఐలు భాస్కర్, నాగేశ్వరరావు, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

# మైనార్టీ మహిళలకు కుట్టు మిషన్ల పంపిణీ

**... స్టోన్ కటింగ్ మిషన్లు, జనరేటర్లు, కాటమయ్య కిట్లు అందజేసిన ఎమ్మెల్యే.**

**మహబూబాబాద్, అక్టోబర్ 2 (జనం వాయిస్):**

మహబూబాబాద్ నియోజకవర్గ పరిధిలోని మైనార్టీ మహిళలకు ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలలో భాగంగా 100 మంది మహిళలకు కుట్టు మిషన్లను పంపిణీ చేశారు. అలాగే లబ్ధిదారులకు స్టోన్ కటింగ్ మిషన్లు, జనరేటర్లు, కాటమయ్య కిట్లను మహబూబాబాద్ ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే డాక్టర్ భూక్య మురళి నాయక్ మాట్లాడుతూ.. ప్రభుత్వం అన్ని వర్గాల ప్రజల అభివృద్ధి, సంక్షేమం కోసం అనేక పథకాలను ప్రవేశపెట్టి అమలు చేస్తోందన్నారు. నిరుద్యోగ యువతీ యువకులు ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలను సద్వినియోగం చేసుకుని స్వయం ఉపాధి ద్వారా ఆర్థికంగా బలోపేతం కావాలని కోరారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలను అర్హులైన ప్రతి ఒక్కరూ వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ చైర్‌పర్సన్ గూగులోత్ జ్యోతి, జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారిణి నాగలక్ష్మి, స్థానిక కౌన్సిలర్లు, ప్రజాప్రతినిధులు, ముస్లిం, బీసీ సంఘాల ప్రతినిధులు పాల్గొన్నారు.




# వికసిత్ గ్రామపంచాయతీ ప్లాన్‌పై గ్రామసభలు

**... జిల్లాలోని 482 గ్రామపంచాయతీల్లో ప్రత్యేక గ్రామసభల నిర్వహణ**

**మహబూబాబాద్, అక్టోబర్ 2 (జనం వాయిస్) :**




వికసిత్ గ్రామపంచాయతీ ప్లాన్ కార్యక్రమంలో భాగంగా మహబూబాబాద్ జిల్లాలోని 482 గ్రామపంచాయతీల్లో శుక్రవారం ప్రత్యేక గ్రామసభలు నిర్వహించారు. గ్రామాల సమగ్ర అభివృద్ధికి అవసరమైన ప్రణాళికలు, స్థానిక అవసరాలు, మౌలిక వసతుల అభివృద్ధికి సంబంధించిన అంశాలపై గ్రామసభల్లో చర్చించారు. ఈ కార్యక్రమంలో భాగంగా డోర్నకల్ మండలం ములకలపల్లి గ్రామపంచాయతీలో నిర్వహించిన గ్రామసభకు అదనపు కలెక్టర్ (స్థానిక సంస్థలు), హౌసింగ్ పీడీ పురుషోత్తం, డీఆర్డీఓ అదనపు పీడీ మల్లేశ్వరి, డీపీఓ రేవంత్తో పాటు జిల్లా స్థాయి ప్రత్యేక అధికారులు పాల్గొన్నారు. గ్రామ ప్రజల అభిప్రాయాలు, అవసరాలను తెలుసుకుని వాటికి అనుగుణంగా అభివృద్ధి ప్రణాళికలను రూపొందించేందుకు ఈ గ్రామసభలు నిర్వహిస్తున్నట్లు అధికారులు తెలిపారు. గ్రామస్థుల భాగస్వామ్యంతో గ్రామాల అభివృద్ధికి అవసరమైన ప్రాధాన్యతా అంశాలను గుర్తించి ప్రణాళికలో పొందుపరచనున్నట్లు పేర్కొన్నారు.

డైనమిక్ జనంవాయిస్
తెలుగు దినపత్రిక
నిజం మా మాట | న్యాయం మా ధ్యేయం | ప్రజల కోసం మా ప్రయాణం
PRGI NO: TGTEL/26/A0383

# వల్లెపు ఎల్లయ్య పార్థివ దేహాన్ని సందర్శించి, వారి కుటుంబ సభ్యులను పరామర్శించి, ఆర్థిక సహాయం అందజేసిన: ఐలేని సుధాకర్ రెడ్డి.

**అక్టోబర్ 2 జనం వాయిస్ పాలకుర్తి:**

పాలకుర్తి మండలం: శాతపురం గ్రామానికి చెందిన, వల్లెపు ఎల్లయ్య గుండెపోటుతో మరణించాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ జిల్లా నాయకులు ఐలేని సుధాకర్ రెడ్డి పార్టీ నాయకులతో కలిసి, ఎల్లయ్య పార్థివ దేహాన్ని సందర్శించి వారి కుటుంబ సభ్యులను పరామర్శించారు. ఆర్థిక సహాయం అందించి వారి కుటుంబానికి అన్ని విధాల అండగా ఉంటామని, ధైర్యాన్ని కల్పించారు. వారి వెంట, పార్టీ గ్రామ శాఖ కార్యదర్శి పసులాది పోషయ్య, పార్టీ నాయకులు బొందుగుల విజయ్, నాయిని నర్సిరెడ్డి, గన్న కృష్ణ మూర్తి, బీరెల్లి కిష్టయ్య, పెద్ద నాగయ్య, ముత్తయ్య, రవి వర్మ, ఇటికాల సోమరాజు, ఐలేని శ్రవణ్, చిలూరి యాదయ్య, పసులాది యాదయ్య, ఉప్పలయ్య, ఉపేందర్, కంజర్ల యాకన్నా, బీరెల్లి, శ్రీను వేణు, వారి కుటుంబ సభ్యులు వల్లపు యాదగిరి, చొక్కయ్య, నరసింహ, తదితరులున్నారు...



# నల్లా నరసింహులు, మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా ఘన నివాళులు

## విగ్రహాలకు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించిన

అక్టోబర్ 2 జనం వాయిస్ పాలకుర్తి:

మండల కేంద్రంలోని- తెలంగాణ సాయుధ పోరాట యోధుడు, విప్లవ సింహం నల్లా నరసింహులు జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి పూలమాల వేసి ఘనంగా నివాళులు అర్పించిన మాజీ మంత్రి వర్యులు ఎర్రబెల్లి దయాకర్ రావు తెలంగాణ సాయుధ పోరాటంలో నల్లా నరసింహులు చేసిన పోరాటాన్ని, ప్రజల కోసం ఆయన అందించిన సేవలను ఈ సందర్భంగా ఎర్రబెల్లి దయాకర్ రావు స్మరించుకున్నారు. అన్యాయానికి, దోపిడీకి వ్యతిరేకంగా ప్రజల హక్కుల కోసం పోరాడిన నల్లా నరసింహులు వంటి యోధుల త్యాగాలు తెలంగాణ ప్రజల చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని పేర్కొన్నారు అదేవిధంగా జాతిపిత మహాత్మా గాంధీ జయంతి సందర్భంగా పాలకుర్తి మండల కేంద్రంలోని గాంధీ విగ్రహానికి పూలమాల వేసిన - మాజీ మంత్రి వర్యులు - ఎర్రబెల్లి దయాకర్ రావు ఘనంగా నివాళులు అర్పించారు.

సత్యం, అహింస, శాంతి, సామాజిక సమానత్వం కోసం మహాత్మా గాంధీ చేసిన కృషిని ఈ సందర్భంగా ఆయన స్మరించుకున్నారు. స్వాతంత్ర్య ఎబఅసమరంలో గాంధీజీ చూపిన అహింసా మార్గం, దేశ ప్రజలను ఏకం చేసిన తీరు, ఆయన ఆశయాలు నేటి తరానికి కూడా స్ఫూర్తిదాయకమని పేర్కొన్నారు ఒకవైపు తెలంగాణ గడ్డపై ప్రజల హక్కుల కోసం పోరాడిన నల్లానరసింహులు, మరోవైపు దేశ స్వాతంత్ర్యం కోసం అహింసా మార్గంలో ఉద్యమించిన మహాత్మా గాంధీ --- ఇద్దరు మహనీయుల జయంతి సందర్భంగా వారిని స్మరించుకోవడం గర్వకారణమని ఎర్రబెల్లి దయాకర్ రావు తెలిపారుఈ కార్యక్రమంలో పార్టీ అధ్యక్షులు పసునూరి నవీన్ మాజీ జెడ్పిటిసి పుష్కారు శ్రీనివాసరావు గ్రామ సర్పంచి కమ్మగాని విజయ నాగన్న గౌడ్ ఉప సర్పంచ్ గాదపాక కిరణ్ వార్డు సభ్యులు వీరమనేని హనుమంతరావు మామిళ్ళ శోభన్ బాబు కమ్మగాని సుధాకర్ గౌడ్ సతీష్ నాగిరెడ్డి మాచర్ల ఎల్లయ్య కటారి పాపారావు కారు పోతుల వేణు లక్ష్మణ్ రేపాల అశోక్ వేణు రావు రాములు కోల నారాయణ ప్రజా ప్రతినిధులు కార్యకర్తలు మహనీయులకు ఘనంగా నివాళులు అర్పించారు.



# అహింసే గాంధీ ఆయుధం శాంతి తన మార్గం

**-పాలకుర్తి మార్కెట్ కమిటీ చైర్మన్ లావుడ్య మంజుల భాస్కర్**
**-పాలకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ**
**-పాలకుర్తి మండల పార్టీ అధ్యక్షులు పోగు శ్రీనివాస్**

**అక్టోబర్ 2 జనం వాయిస్ పాలకుర్తి:**

సూర్యుడు అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని అహింసే ఆయుధంగా గడగడలాడించిన మహాత్ముడు మహాత్మా గాంధీ అని పాలకుర్తి మార్కెట్ చైర్ పర్సన్ లావుడియా మంజుల, పాలకుర్తి బ్లాక్ కాంగ్రెస్ అధ్యక్షుడు రాపాక సత్యనారాయణ, గాంధీ జయంతి సందర్భంగా పాలకుర్తి మండల కేంద్రంలోని మహాత్మా గాంధీ విగ్రహానికి కాంగ్రెస్ నాయకులు పూలమాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా రాపాక సత్యనారాయణ మాట్లాడుతూ దేశానికి అహింసా మార్గంలో స్వాతంత్రం తీసుకు వచ్చిన ఘనత మహాత్మా గాంధీకి దక్కుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మహాత్మా గాంధీని ఆదర్శంగా తీసుకొని శాంతియుత మార్గంలో ముందుకు సాగాలని సూచించారు. మహాత్మా గాంధీ ఆశయాలు, సత్యం, అహింసా సిద్ధాంతాలు నేటి సమాజానికి కూడా స్ఫూర్తిదాయకమని అన్నారు. గాంధీజీ చూపిన మార్గంలో ప్రతి ఒక్కరూ నడుస్తూ సమాజ శ్రేయస్సు కోసం కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షులు గిరగాని కుమారస్వామి, పార్టీ మండల ఉపాధ్యక్షులు మారం శ్రీనివాస్, సలేంద్ర సంపత్, ఓబీసీ జిల్లా ప్రధానకార్యదర్శి నారగొని ఎల్లయ్య, బిసి, ఎస్ టీ సెల్ మండల అధ్యక్షులు బైకాని ఐలేష్, లావుడ్య భాస్కర్ నీరటి చంద్రయ్య, రవి నాయకులు తదితరులు పాల్గొన్నారు.



# పేదింటి ఆడబిడ్డలకు 'కళ్యాణ లక్ష్మి' కొండంత బాసట

- ♦ 12 ఏళ్లు పూర్తయిన పథకాన్ని మరింత పకడ్బందీగా అమలు చేయాలి.
- ♦ బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చిరంజీవి.

**మహబూబాబాద్, అక్టోబర్ 2 (జనం వాయిస్) :**

పేదింటి ఆడబిడ్డల వివాహాలకు ఆర్థిక భరోసా కల్పించే 'కళ్యాణ లక్ష్మి' పథకం ప్రారంభమై నేటికి 12 సంవత్సరాలు పూర్తయ్యాయని చిన్నగూడూరు మండలం మెగ్యా తండా బీఆర్ఎస్ గ్రామ శాఖ అధ్యక్షుడు చిరంజీవి అన్నారు. తెలంగాణ ప్రభుత్వం ఈ పథకాన్ని 2014 అక్టోబర్ 2న



ప్రారంభించింది. ఈ సందర్భంగా చిరంజీవి మాట్లాడుతూ.. తెలంగాణ రాష్ట్రం ఏర్పడిన అనంతరం అప్పటి ముఖ్యమంత్రి కల్వకుంట్ల చంద్రశేఖర్‌రావు (కేసీఆర్) పేద కుటుంబాల ఆర్థిక ఇబ్బందులను దృష్టిలో పెట్టుకుని కళ్యాణ లక్ష్మి పథకాన్ని ప్రవేశపెట్టారని అన్నారు. ప్రారంభంలో రూ.51 వేలుగా ఉన్న ఆర్థిక సాయం అనంతరం రూ.75,116కు, 2018లో రూ.1,00,116కు పెరిగిందని తెలిపారు. పేద కుటుంబాల్లో ఆడబిడ్డల వివాహానికి ప్రభుత్వం ఆర్థిక సహాయం అందించడం ద్వారా వారికి అండగా నిలిచే పథకంగా కళ్యాణ లక్ష్మి నిలిచిందన్నారు. ఈ పథకాన్ని మరింత సమర్థవంతంగా అమలు చేసి అర్హులైన ప్రతి కుటుంబానికి ప్రయోజనం అందించాలని కోరారు. అనంతరం కాంగ్రెస్ ప్రభుత్వంపై చిరంజీవి విమర్శలు చేశారు. ఎన్నికల సమయంలో కళ్యాణ లక్ష్మి కింద నగదు సాయంతో పాటు తులం బంగారం ఇస్తామని కాంగ్రెస్ హామీ ఇచ్చిందని, ఆ హామీని అమలు చేయాలని డిమాండ్ చేశారు. పేద కుటుంబాలకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం నెరవేర్చాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఉపసర్పంచ్ గుగులోత్ వీరన్న, చిన్నగూడూరు మండల బీఆర్ఎస్ సోషల్ మీడియా అధ్యక్షుడు బాదావత్ సురేష్, వార్డు సభ్యులు బాదావత్ బద్రి లక్ష్మణ్, గుగులోత్ సావిత్రి రఘు, బాదావతి వెన్నెల శ్రీకాంత్, భూక్య రవి తదితరులు పాల్గొన్నారు.

# జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని పునరుద్ధరణ చేయాలి

**200 రోజులు పని కల్పించి రోజుకు రూపాయలు 800 వేతనం ఇవ్వాలి. తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో ప్లే కార్డ్స్ తో నిరసన.**

**అక్టోబర్ 2 జనం వాయిస్ పాలకుర్తి:**

మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధాతథంగా అమలు చేయాలని తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు చిట్యాల సోమన్న డిమాండ్ చేశారు. శుక్రవారం పాలకుర్తి నియోజకవర్గ కేంద్రంలో తెలంగాణ వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యంలో తెలంగాణ రైతాంగ సాయుధ పోరాట యోధురాలు ఐలమ్మ చౌరస్తాలో ప్లే కార్డ్స్ తో నిరసన వ్యక్తం చేశారు ఈ సందర్భంగా సోమన్న పాల్గొని మాట్లాడుతూ ఒకవైపున నిత్యవసర ధరలు మండిపోతున్నాయని ఇలాంటి సమయంలో గ్రామీణ పేదలకు ఉపాధి కల్పించడమే తక్షణ పరిష్కారమని. కేంద్ర ప్రభుత్వం ఉపాధి హామీ కోసం 2 లక్షల కోట్ల ప్రత్యేక ప్యాకేజీని వెంటనే



ప్రకటించి ఉపాధి పనులు చేపట్టాలని, కేంద్ర ప్రభుత్వం తీసుకువచ్చిన కొత్త చట్టంలో 125 రోజులు పని దినాలు పెంచిన కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయింపులో భారీ కోత విధించిందని చెప్పారు, కేంద్రం ఇచ్చే 90% నిధుల వాట నుండి 60 శాతానికి కుదించిందని రాష్ట్ర ప్రభుత్వాల మీద 40% అధిక భారాన్ని మోపడం చూస్తే పేదలకు పని కల్పించే బాధ్యత నుండి కేంద్ర ప్రభుత్వం తప్పుకోవడంలో భాగమేనని, పారదర్శకత పేరుతో రెండుసార్లు ఫోటోలు ఆన్లైన్లో అప్లోడ్ అయితేనే వేతనాలు ఇస్తామనడం ఆందోళన కలిగిస్తుందని, తక్షణం రెండుసార్లు ఫోటోల విధానాన్ని రద్దు చేయాలని వారన్నారు. పనిముట్లు ఇచ్చే పద్ధతిని నిలిపివేయడం పని ప్రదేశంలో కనీస సౌకర్యాలు కల్పించకపోవడం వార వారం వేతనాలు ఇవ్వకపోవడం సమ్మర్ అలవెన్స్ రద్దు చేయడం, దూర ప్రాంతాల పనికి లోకల్ ట్రావెలింగ్ అలవెన్స్ రద్దు చేయడం కూలీల పని డిమాండ్ అప్లికేషన్ తీసుకోకపోవడం వంటి చర్యలు పనిని రద్దు చేయడం దానిలోనే భాగమే అని విమర్శించారు, గ్రామీణ కూలీలు వ్యవసాయ పనులు కరువై ఉపాధి లేక వస్తువులతో అల్లాడుతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు,కరువు వర్షాభావం పకృతి వైపరీత్యాలతో ఇప్పటికే తీవ్రంగా దెబ్బతిన్న గ్రామీణ ప్రజలను ఆదుకోవాల్సిన కేంద్ర ప్రభుత్వం పట్టించుకోవడంలేదని విమర్శించారు. తక్షణం గ్రామీణ ఉపాధి హామీ చట్టాన్ని యధాతథంగా అమలు చేసి ఉపాధి కూలీలకు 200 రోజులు పని కల్పించి రోజువారి కూలీ 800 రూపాయలు ఇవ్వాలని కోరారు,ఈ కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా కమిటీ సభ్యురాలు కాకర్ల పద్మ, మండల అధ్యక్షులు కాకర్ల బాబు, కే ఎల్లమ్మ, కోంరమ్మ, సోమనరసమ్మ, కే ప్రవీణ్, సోమలక్ష్మి, జి లక్ష్మి, పి వెంకటమ్మ, మైసమ్మ, సోమక్క, బాలమ్మ, చంద్రమ్మ, తదితరులు పాల్గొన్నారు

# బీజేపీ మత విద్వేషాలను రెచ్చగొడుతున్నారు

**... గాంధీజీ స్ఫూర్తితో ప్రజాస్వామ్యవాదులు ఏకం కావాలి : సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి**




**కురవి, అక్టోబర్ 2 (జనం వాయిస్) :** కేంద్రంలోని బీజేపీ ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలు దేశంలో మతసామరస్యానికి తీవ్ర విఘాతం కలిగిస్తున్నాయని సీపీఐ రాష్ట్ర కౌన్సిల్ సభ్యుడు నల్లు సుధాకర్‌రెడ్డి ఆరోపించారు. గాంధీ జయంతి సందర్భంగా శుక్రవారం కురవి మండల కేంద్రంలోని సీపీఐ కార్యాలయంలో మహాత్మాగాంధీ చిత్రపటానికి పూలమాల వేసి ఘన నివాళులర్పించారు. ఈ సందర్భంగా సుధాకర్‌రెడ్డి మాట్లాడుతూ.. గాంధీజీ మతసామరస్యానికి, పరమత సహనానికి ప్రతీకగా నిలిచారని అన్నారు. మత సామరస్యం, భిన్నత్వంలో ఏకత్వాన్ని కాపాడాలని కోరుకున్నందుకే గాంధీజీ హత్యకు గురయ్యారని పేర్కొన్నారు. గాంధీజీని హత్య చేసిన నాథూరామ్ గాడ్సేను దేశభక్తుడిగా, స్ఫూర్తిగా చూపించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. మెజారిటీ వాద రాజకీయాలతో మైనార్టీలకు తావు లేకుండా చేసే ప్రయత్నాలు దేశంలో మత విద్వేషాలను పెంచుతున్నాయని ఆరోపించారు. ఇలాంటి పరిస్థితులను నివారించేందుకు గాంధేయవాదులు, ప్రగతిశీల శక్తులు, ప్రజాస్వామ్యవాదులు ఏకమై పోరాడాలని పిలుపునిచ్చారు. భారతీయ సంస్కృతిలోని "భిన్నత్వంలో ఏకత్వం" స్ఫూర్తిని కాపాడటమే గాంధీజీకి అందించే ఘనమైన నివాళి అని అన్నారు. ఈ కార్యక్రమంలో సీపీఐ మండల కన్వీనర్ బుడమ వెంకన్న, మండల సహాయ కార్యదర్శి బుర్ర సమ్మయ్య, టి. రమేష్, దూది కట్ల సారయ్య, నిలిగొండ నాగేశ్వరరావు, కలగూర నాగరాజు, సీపీఐ నాయకులు కన్నె వెంకన్న తదితరులు పాల్గొన్నారు.

# ట్యాంకర్ ఢీకొని ట్రాక్టర్ డ్రైవర్ మృతి



**జనం వాయిస్, శాయంపేట, అక్టోబరు 2:** శాయంపేట మండలం కొత్తగట్టు సింగారం స్టేజీ సమీపంలో శుక్రవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ట్రాక్టర్ డ్రైవర్ యెజ్జల శ్రీను (30) మృతి చెందాడు. శాయంపేట ఎస్సై జక్కుల పరమేష్ తెలిపిన వివరాల ప్రకారం.. పరకాల నుంచి వరంగల్ వైపు వెళ్తున్న ట్రాక్టర్‌ను వెనుక నుంచి వచ్చిన ట్యాంకర్ (టిఎస్ 25 టి 1948) అతివేగంగా ఢీకొట్టింది. దీంతో ట్రాక్టర్ బోల్తాపడగా డ్రైవర్ శ్రీను అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడి అన్న యెజ్జల నాగేశ్ ఫిర్యాదు మేరకు ట్యాంకర్ డ్రైవర్‌పై బీఎన్ఎస్ 106(1) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

# బాల్య వివాహ రహిత గ్రామంగా నూర్జహాన్ పల్లి గ్రామసభలో తీర్మానం




**జనం వాయిస్, శాయంపేట, అక్టోబరు 2:** నూర్జహన్ పల్లి గ్రామాన్ని బాల్య వివాహ రహిత గ్రామంగా తీర్చిదిద్దేందుకు గ్రామసభలో తీర్మానం చేశారు. వికసిత గ్రామపంచాయతీ ప్రణాళికలో భాగంగా శుక్రవారం సర్పంచ్ అధ్యక్షతన ప్రత్యేక గ్రామసభ నిర్వహించారు. మహిళా శిశు సంక్షేమ శాఖ, షేర్ స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నివారణపై అవగాహన కల్పించారు. బాల్య వివాహాలతో బాలికల విద్య, భవిష్యత్తుపై ప్రతికూల ప్రభావం పడుతుందని వివరించారు. బాల్య వివాహాలు జరగకుండా ప్రతి ఒక్కరూ బాధ్యతగా వ్యవహరించాలని సూచించారు.ఈ కార్యక్రమంలో షేర్ ఎన్జీవో ప్రతినిధి బి. జగన్, పంచాయతీ కార్యదర్శి, వార్డు సభ్యులు, అంగన్‌వాడీ, ఆశ కార్యకర్తలు, మహిళా సంఘాల నాయకులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ప్రభుత్వ భూమి సర్వేలో 'తిరక్కాస్'...!?

**... సర్వే నెం.177లో హద్దులు నిర్ణయించేందుకు నేడు 3న సర్వే**
**... ఫిర్యాదుదారుల్లో ఒక్కరికే నోటీసు జారీపై దళిత నాయకుల అభ్యంతరం**
**... 'మసి భూసి.. మారేడు కాయ' సర్వే వద్దు**
**... డిజిటల్ సర్వేతోనే హద్దులు తేల్చాలి.**

**కురవి, అక్టోబర్ 2 (జనం వాయిస్) :** మహబూబాబాద్ జిల్లా కురవి మేజర్ గ్రామపంచాయతీ రెవెన్యూ పరిధిలోని సర్వే నెం.177, బై నెంబర్ల లోని ప్రభుత్వ భూమిని కబ్జాల నుంచి కాపాడి, హద్దులు నిర్ణయించి రక్షణ బోర్డు ఏర్పాటు చేయాలని దళిత నాయకులు దైద భద్రయ్య, ఇరుగు వెంకన్న, కిన్నెర మల్లయ్యలు జిల్లా కలెక్టర్‌కు ప్రజావాణిలో ఫిర్యాదు చేశారు. ఈ ఫిర్యాదు నేపథ్యంలో జిల్లా రెవెన్యూ అదనపు కలెక్టర్ భూమిని పరిశీలించి సర్వే నిర్వహిస్తామని హామీ ఇచ్చినట్లు వారు తెలిపారు. ఈ నేపథ్యంలో జిల్లా సర్వే అధికారి, జిల్లా భూమి కొలతలు, రికార్డుల శాఖ మహబూబాబాద్ కార్యాలయం నుంచి ఎ3/467/2026 ఫైల్‌కు సంబంధించి నోటీసు జారీ అయింది. సర్వే నెం.172, 177లో హద్దులు నిర్ణయించేందుకు నేడు (3న) మధ్యాహ్నం 2 గంటలకు అధికారులు ప్రదేశానికి రానున్నట్లు నోటీసులో పేర్కొన్నారు. సర్వే సమయంలో గొలుసులు, జండాలు, పంచులు, సరిహద్దుదారులు, సాక్షులతో హాజరు కావాలని సూచించారు.

ఒక్కరికే నోటీసు ఎందుకు..?

అయితే ఈ సర్వే ప్రక్రియపై ఫిర్యాదుదారులు అభ్యంతరం వ్యక్తం చేస్తున్నారు. సర్వే నంబర్ల చుట్టుపక్కల ఉన్న భూముల సరిహద్దుదారులు, సంబంధిత రైతులందరికీ సమాచారం ఇవ్వాల్సి ఉండగా, ఫిర్యాదుదారులు ముగ్గురిలో ఒక్కరికే నోటీసు ఇవ్వడం వెనుక ఉద్దేశం ఏమిటని వారు ప్రశ్నిస్తున్నారు. సంబంధం లేని వ్యక్తికి నోటీసు ఇచ్చారని కూడా ఆరోపిస్తున్నారు. 177 సర్వే నంబర్ భూమికి సంబంధించి చుట్టుపక్కల రైతులకు నోటీసులు ఇవ్వకపోవడంపై పలు అనుమానాలకు తావు ఇస్తోంది.

'మసి భూసి.. మారేడు కాయ' సర్వే వద్దు

ప్రభుత్వ భూమిని కాపాడాలని ఫిర్యాదు చేస్తే, సమస్యకు శాశ్వత పరిష్కారం చూపకుండా కేవలం మొక్కుబడిగా కొలతలు నిర్వహించే ప్రయత్నం జరుగుతోందని దళిత నాయకులు ఆరోపిస్తున్నారు. "ప్రభుత్వ భూమి పరిరక్షణే లక్ష్యంగా సర్వే జరగాలి. మొక్కుబడి కొలతలతో సమస్యను పక్కదారి పట్టించొద్దు" అని వారు డిమాండ్ చేస్తున్నారు.

డిజిటల్ సర్వేతోనే అసలు హద్దులు తేల్చాలి..

సర్వే నెం.177లోని ప్రభుత్వ భూమికి సంబంధించి పాత రికార్డులు, ప్రస్తుత భౌతిక పరిస్థితులు, హద్దులను పరిశీలించి డిజిటల్ సర్వే ద్వారా ఖచ్చితమైన కొలతలు నిర్వహించాలని ఫిర్యాదుదారులు కోరుతున్నారు. అనంతరం ప్రభుత్వ భూమి చుట్టూ స్పష్టమైన హద్దులు ఏర్పాటు చేసి, 'ప్రభుత్వ భూమి' అని సూచించే బోర్డును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు. అధికారులు పారదర్శకంగా సర్వే నిర్వహించి, సంబంధిత సరిహద్దుదారులందరికీ సమాచారం ఇచ్చి, ప్రభుత్వ భూమిని కబ్జాల నుంచి కాపాడే చర్యలు తీసుకుంటారా.. లేక మొక్కుబడి సర్వేతోనే సరిపెడతారా అన్నది వేచి చూడాలి.

# ఆక్రమణదారుల చేతుల్లో సరస్వతి నిలయం..!

**కురవి ప్రభుత్వ పాఠశాలకు చెందిన 3 ఎకరాల 30 గుంటల భూమి మాయం?.**
**సర్వే నెంబర్లు 742, 743, 744, 527/ఎ, 528/ఎ, 529, 529/ఎ2/2 లలో పక్కదారి పట్టిన విలువైన ప్రభుత్వ స్థలం.**
**చారిత్రాత్మక పాఠశాల హద్దులపై సమగ్ర విచారణ జరపాలని ప్రజలు, పూర్వ విద్యార్థుల డిమాండ్.**

**మహబూబాబాద్, సెప్టెంబర్ 2 (జనం వాయిస్) :**

మహబూబాబాద్ జిల్లా కురవి మండల కేంద్రంలోని ప్రభుత్వ పాఠశాల భూములు ఆక్రమణదారుల చేతుల్లో చిక్కుకొని కన్నీరు పెడుతున్నాయి. ఎంతోమందిని ఉన్నత విద్యావంతులుగా తీర్చిదిద్దిన ఈ అక్షరాల నిలయానికి చెందిన విలువైన ప్రభుత్వ భూమి ప్రస్తుతం కబ్జాకు గురైనట్లు తీవ్ర ఆరోపణలు వ్యక్తమవుతున్నాయి. మండల కేంద్రం రెవిన్యూ పరిధిలోని మొత్తం 275 ఎకరాల 22 గుంటల ప్రభుత్వ భూమిలో భాగంగా, సర్వే నెంబర్లు 742లో 33 గుంటలు, 743లో 02ఎకరాల 08 గుంటలు, 744లో 33 గుంటలు, 527/ఎలో 01 ఎకరం 25 గుంటలు, 528/ఎ లో 1ఎకరం 20 గుంటలు, 529లో 01 ఎకరం,




529/ఎ2/2లో 01 ఎకరం 29 గుంటలు మొత్తం 09:30 భూమి ఉంది. నాటి పాలకులు 1వ తరగతి నుండి 5వ తరగతి (ప్రాథమిక), అలాగే 6వ తరగతి నుండి 10వ తరగతి (ఉన్నత) విద్యార్థుల కోసం మొత్తం 9 ఎకరాల 30 గుంటల ప్రభుత్వ భూమిని కేటాయించారు. ఎన్నో ఏళ్ల ఘన చరిత్ర కలిగిన ఈ పాఠశాలలో చదువుకున్న పూర్వ విద్యార్థులు ఎంతోమంది వివిధ రంగాల్లో ఉన్నత స్థాయిల్లో స్థిరపడి గ్రామానికి, మండలానికి మంచి పేరు తెచ్చారు.

## నూతన నిర్మాణాల వేళ హద్దులు ఏవి?

కాలక్రమేణా శిథిలావస్థకు చేరిన ఈ ఆదర్శ పాఠశాల భవనాల స్థానంలో, సుమారు 15 ఏళ్ల క్రితం ప్రభుత్వం నూతన భవనాలతో పాటు చుట్టూ ప్రహరీ గోడను నిర్మించింది. అలాగే ఇదే ప్రాంగణంలో గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాల భవనాన్ని కూడా ఏర్పాటు చేశారు. అయితే, నాటి నిర్మాణాల సమయంలో అధికారులు కనీస నిబంధనలను విస్మరించారనే విమర్శలు ఉన్నాయి. పాఠశాల స్థలానికి సంబంధించిన సర్వే నెంబర్ల ప్రకారం ల్యాండ్ సర్వే చేయకుండా, అధికారికంగా హద్దులు ఏర్పాటు చేయకుండానే హుటాహుటిన ఈ నిర్మాణ పనులు చేపట్టడం గమనార్హం.

## 3 ఎకరాల 30 గుంటల భూమి మాయం!

పాఠశాల రికార్డుల ప్రకారం కేటాయించిన సర్వే నెంబర్ల ఆధారంగా ఇక్కడ మొత్తం 9 ఎకరాల 30 గుంటల భూమి ఉండాలి. కానీ, ప్రస్తుత పరిస్థితులను పరిశీలిస్తే గిరిజన బాలికల పాఠశాల భవన నిర్మాణ స్థలంతో కలిపి సుమారు 6 ఎకరాల లోపు భూమి మాత్రమే మిగిలినట్లు స్పష్టమవుతోంది. అంటే దాదాపు 3 ఎకరాల 30 గుంటల అమూల్యమైన పాఠశాల భూమి అక్రమార్కుల పాలు కావడమో లేదా కబ్జాకు గురికావడమో జరిగిందని భూములపై అవగాహన ఉన్న స్థానికులు, పాఠశాల పూర్వ విద్యార్థులు తీవ్ర అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

## అధికారుల స్పందన కోసం నిరీక్షణ

తమకు విద్యాబుద్ధులు నేర్పిన పాఠశాల స్థలం ఇలా అక్రమార్కుల చేతుల్లోకి వెళ్లడంపై పూర్వ విద్యార్థులు, స్థానిక ప్రజలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా ఉన్నతాధికారులు, రెవిన్యూ యంత్రాంగం తక్షణమే స్పందించాలని వారు కోరుతున్నారు. సర్వే నెంబర్లు 742లో 33 గుంటలు, 743లో 02ఎకరాల 08 గుంటలు, 744లో 33 గుంటలు, 527/ఎలో 01 ఎకరం 25 గుంటలు, 528/ఎ లో 1ఎకరం 20 గుంటలు, 529లో 01 ఎకరం, 529/ఎ2/2లో 01 ఎకరం 29 గుంటలు మొత్తం 09:30 భూమి ఆధారంగా తక్షణమే సమగ్ర విచారణ (డిజిటల్ సర్వే) జరిపి, పాఠశాల భూమిని పూర్తి స్థాయిలో కొలవాలని, కబ్జాలను తొలగించి అధికారికంగా హద్దులు ఏర్పాటు చేసి ప్రభుత్వ ఆస్తిని కాపాడాలని స్థానికులు, పూర్వ విద్యార్థులు గట్టిగా డిమాండ్ చేస్తున్నారు. ఇట్టి విషయంపై "జనం వాయిస్" జిల్లా ప్రతినిధి వివరణ కోసం మహబూబాబాద్ జిల్లా విద్యాశాఖ ఇంచార్జి అధికారికి ఫోన్ చేయగా స్పందించలేదు.